

సాక్షి
బాపట్ల

గురువారం । 31 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.50 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3920 క్యూసెక్కులు విడుదల చేశారు.

దుర్గగుడికి విద్యుత్ ద్విచక్ర వాహనం



విజయవాడ: దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన క్వాంటం ఎనర్జీస్ లిమిటెడ్ కంపెనీ(కుశలవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్) బుధవారం విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని కానుకగా సమర్పించింది.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి రథం మోకు సమర్పణ



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి బాల చాముండేశ్వరి సమేత అమరేశ్వర స్వామివారి దివ్య రథానికి బుధవారం నిమ్మగడ్డ రామకృష్ణ దంపతులు సుమారు రూ.50 వేల విలువైన మోకును ప్రముఖ జ్యోతిష్యులు మాచిరాజు వేణుగోపాల్ చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మకు అందజేశారు. అలాగే దేవస్థానంలో నిత్య కైంకర్యానికి అవసరమైన కిలో వెండి పంచ పాత్రలను అమరావతి వాస్తవ్యులు పారేపల్లి రాధాకృష్ణ పుష్పలత దంపతులు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారులకు అందజేశారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

కొరిటెపాడు: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవలు డిప్లొమా కోర్సు ప్రారంభోత్సవ సభ బుధవారం కృషి భవన్‌లో జరగ్గా, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఒక ఏడాది పాటు ప్రతి ఆదివారం డీలర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. లాంఫాం ఏడీ జీఎంవీ ప్రసాద్, విశ్రాంత ఏడీఏ డి.పాపిరెడ్డి, కోర్సు సమన్వయకర్త పి.నీలకంఠేశ్వరరావు మాట్లాడారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన 40 మంది డీలర్లు పాల్గొన్నారు.

గాజులతో అమ్మవారికి శ్రావణలక్ష్మీ అలంకారం



అమరావతి: అమరేశ్వరాలయంలో బుధవారం బాలచాముండేశ్వరి దేవిని గాజులతో శ్రావణ లక్ష్మిగా అలంకరించారు. అమరేశ్వర ఘాట్‌లోని కృష్ణవేణి మాత విగ్రహానికి అభిషేకం చేసి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణవేణి నదికి వేద మంత్రోచ్చారణల, మంగళవాయిద్యాల నడుమ సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ బాల చాముండేశ్వరిదేవికి అలంకరించిన గాజులను రేపటి నుంచి ముత్తయిదువులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేస్తామన్నారు. వర్షాలు సకాలంలో కురిసి ప్రాజెక్టులన్నీ నిండి ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కృష్ణవేణిమాతకు ప్రత్యేకపూజలు నిర్వహించి సారె సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావుతోపాటుగా భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు
దేవతా మూర్తులకు పవిత్ర మాలధారణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పవిత్రోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, అనంతరం స్నపనాభిషేకాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి అలంకరణ, నిత్య పూజల అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, సర్వప్రాయశ్చిత్త విధులను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు శాస్త్రోక్తంగా పవిత్ర మాలధారణ చేశారు.

ఎస్‌బీ అంటే ఎంతిష్టమో..!

ఏళ్ల తరబడి పాతుకుపోయారు
- ఒకే స్టేషన్‌లో విధులు
- అవసరానికి మించి ఉన్న సిబ్బంది
- ఓ సీఐతోపాటు ఎస్పీ కార్యాలయంలోని మరో అధికారిపైనా ఫిర్యాదులు
- డ్యూటీ ఆర్డర్ల జారీలోనూ చేతివాటంపై ఆరోపణలు
- డీఓ ఒక చోట.. విధులు ఎస్‌బీలో ..
- 10 ఏళ్లకుపైగా దాటిన సిబ్బంది ఎందరో..



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కొందరు పోలీసు సిబ్బంది ఏళ్ళ తరబడి స్పెషల్ బ్రాంచిలో పాతుకుపోయారు.. అధికారులకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఒక స్టేషన్‌లో డ్యూటీ ఆర్డర్ (డీఓ) ఉన్నా.. ఎస్‌బీకి ఎటాచ్‌మెంట్ చేయించుకుని ఎదురు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంపై ఇప్పటికే అనేక ఆరోపణలు వస్తున్నా.. కనీసం జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవటం గమనార్హం.

ఎస్‌బీ డీఎస్పీపైనా విచారణ!



స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ). సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను, ఆయా స్టేషన్ సిబ్బంది, అధికారుల అవినీతి గురించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని అరికట్టాల్సిన ప్రధాన విభాగం. ఇప్పుడు అవినీతి ఆరోపణలతో హాట్‌టాపిక్‌గా మారింది. అడ్డగోలుగా వ్యవహరించిన కొంతమందిపై ఇప్పటికే విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఒక ఎస్బీ సీఐని వీఆర్‌కు పంపటం, గతంలో ఒక రైటర్‌ను, హెడ్ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపి సస్పెండ్ చేయడం చర్చనీయాంశమైంది. ఎస్బీ డీఎస్పీపైనా విచారణ కొనసాగుతోందని సమాచారం.

నెల తిరక్కుండానే మళ్లీ పోస్టింగ్
ఇటీవల ఒక మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఒక ఏఎస్ఐ స్థాయి ఎస్బీ అధికారిని సస్పెండ్ చేస్తే.. నెల తిరగకుండా తిరిగి ఎస్బీలో పోస్టింగ్ తెచ్చుకున్నారంటే లోపాయికారిగా ఎలాంటి లావాదేవీలు జరుగుతున్నాయో అర్థమవుతోంది.

విచ్చలవిడిగా పేకాట శిబిరాలు!



గతంలో గుంటూరు రూరల్ జిల్లా ఎస్బీ సీఐగా పనిచేసిన ఒకాయన అనేక ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. జిల్లా విభజన సమయంలో గుంటూరు జిల్లాకు వచ్చిన కొంత మంది సిబ్బంది ఎస్బీలో కొలువుదీరారు. వీరు ప్రస్తుతం వీఆర్‌కు వెళ్లిన సీఐకు పూర్తిగా సహకరించి వసూళ్ల దందా చేశారని సమాచారం. గుంటూరులోని ప్రముఖులు ఉండే ఓ స్టేషన్ పరిధిలోని గెస్ట్ హౌస్‌లు, తెనాలిలో పలు రూములు అద్దెకు తీసుకుని, పొన్నూరులో అధికారుల అండదండలతో, తాడికొండలోని కొండల ప్రాంతాల్లో విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. తెనాలిలో వాటాల విషయంలో తేడా రావటంతోనే అసలు విషయాలు బయటకు వచ్చాయని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా పోలీసు కార్యాలయంలోని ఉన్నతాధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సిబ్బందే కోరుతున్నారు.

మామూళ్లు మరిగి..
ముఖ్యంగా జిల్లాలో అనేక మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, సిబ్బంది ఎస్‌బీలో మామూళ్లు మరిగి ఆ విభాగం నుంచి బయటకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. సుమారు పదేళ్లకుపైబడే ఎస్‌బీలో తిష్టవేసి పేకాట, సింగిల్ నంబర్, రేషన్ మాఫియా, వ్యభిచార గృహాల నుంచి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు అరండల్‌పేట, పాతగుంటూరు, పట్టాభిపురం, నగరంపాలెంతోపాటు అనేక స్టేషన్లలోని ఎస్బీ విభాగంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న సిబ్బందే కొనసాగుతున్నారు. వీరికి పూర్తి స్థాయిలో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి కార్యకలాపాలు జరుగుతాయో అవగాహన ఉంది. దీంతో యథేచ్ఛగా వసూళ్ల దందా సాగిస్తున్నారని సమాచారం.



- ఇటీవల కాలంలో ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒక ఎస్బీ ఏఎస్ఐపై జరిగిన విచారణలో ఆ స్టేషన్ డ్రైవర్ అసాంఘిక కార్యకలాపాల్లో ఏఎస్ఐ హస్తం ఉందని లిఖిత పూర్వకంగా ఇచ్చినట్లు సమాచారం. ఇదంతా జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచే జరుగుతున్నా.. ఉన్నతాధికారులు అసలు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం.

డీఓల్లోనూ.. చేతివాటం..



ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐతోపాటు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉండి పలు పనులు చూసుకునే మరో అధికారిపైనా అనేక ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సిబ్బంది మెమోలకు జవాబులు ఇచ్చే విషయంలో ఈ అధికారి చేతివాటం ప్రదర్శించారనే విమర్శలు ఉన్నాయి. ఎస్ఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు డీఓల్లోనూ ఎస్‌బీ సీఐతో కలిసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారని ఆ శాఖ సిబ్బందే బాహాటంగా చెబుతున్నారు. వీఆర్‌కు వెళ్ళిన సీఐ అక్రమార్జన నెలకు రూ.15 లక్షలకుపైగానే ఉండేదని సిబ్బంది చెవులు కొరుక్కోవడం విస్మయం కలిగిస్తోంది.

'ప్రేమ పేరుతో వలపు వల' నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో వ్యక్తికి వల వేసి ఇంటికి పిలిపించి తన ప్రియుడు, మరో వ్యక్తితో కలసి బెదిరించి డబ్బులు దోచుకున్న కేసులో మహిళతో పాటు ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. భర్తతో విభేదాల కారణంగా తెనాలిలో పిల్లలతో కలసి నివసిస్తున్న కొల్లిపర మండలం సిరిపురానికి చెందిన మహిళ అదే మండలానికే చెందిన వ్యక్తికి ప్రేమ పేరుతో వలపు వల వేయడం, అతన్ని ఇంటికి రమ్మని పిలిచి అప్పటికే సహజీవనం చేస్తున్న మరో వ్యక్తి, అతని మిత్రుడితో కలసి కొల్లిపరకు చెందిన వ్యక్తిని బెదిరించి రూ. 1.40 లక్షలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సదరు మహిళతో పాటు ఆమె సహజీవనం చేస్తున్న వ్యక్తి, అతని స్నేహితుడిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

యార్డుకు 29,650 బస్తాల మిర్చి

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 29,650 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,270 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,048 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మహిళా ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో బుధవారం మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్, గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీలు కె.ఆరిఫ్‌హఫీజ్ (గుంటూరు జిల్లా), మల్లికగర్గ్ (ప్రకాశం జిల్లా) పరీక్షలను పర్యవేక్షించారు. మహిళా అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, నకళ్లను తనిఖీ చేశారు. అనంతరం బయోమెట్రిక్, ఛాతీ, ఎత్తు, 1,600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతుల్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రేంజ్ పరిధిలో ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 15 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుంటూరు రేంజ్ పరిధిలో వర్షం వల్ల వాయిదా పడిన పరీక్షలను సెప్టెంబర్ 16, 19 తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎస్పీలు అంకితా సూరన (ఒంగోలు), కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు) పలువురు మహిళా పోలీస్ అధికారులు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఆర్ఐలు, పలువురు సీఐలు మినిస్టీయల్, పోలీస్ సిబ్బంది పరీక్షలు నిర్వహించారు.



అభ్యర్థి ఎత్తు కొలతను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

'అమ్మా'నుషం

కష్టాల సెగ తనువెల్లా దహిస్తున్నా.. బిడ్డలకు చల్లని ఒడియైన ఆ దేహం ఇప్పుడు రోడ్డు పక్కన చెట్టు నీడన అవసాన దశలో పడి ఉంది. లాలీ..లాలీ.. అంటూ జోల పాడిన ఆ మధుర కంఠం నేడు రోగవేదనతో మూలుగుతోంది. చివరి దశలో బిడ్డలు చెంత లేక ఆ మాతృహృదయం తల్లడిల్లుతోంది. గుండెలను పిండేసే ఈ దృశ్యం నాదెండ్ల మండలం గణపవరంలో బుధవారం స్థానికులను కంటతడి పెట్టించింది. ఆమె వద్ద ఉన్నవన్నీ తీసుకుని చివరకు రోడ్డుపాలు చేసిన కసాయి బిడ్డలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- కనిపెంచిన తల్లిని మరిచిన సంతానం
- అనారోగ్యస్థితిలో చెట్టుకింద అనాథలా అమ్మ
- పట్టించుకునేవారు లేక పడి ఉన్న దైన్యం

నాదెండ్ల: కాకినాడకు చెందిన కాకర్ల కాంతమ్మ (75), సీతారామయ్య కుటుంబం పదేళ్ల కిందట నాదెండ్ల మండలం గణపవరానికి వలస వచ్చింది. ఆ దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీశారు. వీరికి ముగ్గురు సంతానం.. అప్పటికే ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి పెళ్లిళ్లు చేశారు. ఒక కుమార్తె కర్ణాటక, మరొకరు కాకినాడ, కుమారుడు గుంటూరులో ఉంటున్నారు. ఎనిమిదేళ్ల కిందట కాంతమ్మ భర్త చనిపోయాడు. అప్పటి నుంచి రాజీవ్‌గాంధీ కాలనీలోని ఐదో లైనులోని అద్దెఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఇక్కడే ఆమెకు ఆధార్‌కార్డు ఉంది. ఆమెకు గూని ఉండడంతో వైఎస్సార్ దివ్యాంగ పెన్షన్ వస్తోంది. స్థానిక జగనన్న కాలనీలో స్థలమూ మంజూరైంది. మూడు నెలల కిందట కుమార్తెలు, కుమారుడు వచ్చి కాంతమ్మ కూడబెట్టుకున్న పెన్షన్ డబ్బులు, కొద్దిపాటి బంగారం, ఇంటిస్థలం కాగితాలను తీసుకెళ్లారు. నెలరోజులుగా ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. పదిరోజుల కిందట ఆటోలో కుమారుడి వద్దకు వెళ్తానంటూ ఇల్లు ఖాళీ చేసి గుంటూరు వెళ్లింది. అడ్రస్ తెలియక తిరిగి ఇక్కడికే వచ్చింది. తీరా ఇల్లు లేకపోవడంతో 16వ నంబర్ హైవే పక్కనే ఉన్న మద్దిలక్ష్మయ్య మిల్లు సమీపంలోని ఓ చెట్టుకింద ఉండిపోయింది. వచ్చేపోయే వారు వృద్ధురాలి దీనస్థితిని చూసి జాలిపడి టిఫిన్, భోజనం అందిస్తున్నారు. మూడు రోజుల కిందట వలంటీర్ ఏడుకొండలు, గ్రామ మహిళా పోలీసు కుటుంబ సభ్యులకు ఫోన్లు చేశారు. వెంటనే వస్తామని, ఆశ్రమంలో చేరుస్తామని చెప్పి ఇప్పటికీ రాలేదు. ప్రస్తుతం వృద్ధురాలి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆహారం ఏమీ తీసుకునే పరిస్థితి లేదు. అత్యవసరంగా ఆస్పత్రిలో చేర్పించాలి. కుటుంబ సభ్యులు స్పందించకుంటే అధికారులైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన దీనావస్థలో వృద్ధురాలు కాంతమ్మ

కంటిపాపల్లె పాలన

- పాలనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- జిల్లాలో ఐదు విడతలుగా 432 మందికి
- ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులు..
- బాపట్ల కలెక్టరేట్‌లో విస్తరణ శిక్షణ కేంద్రం

బాపట్ల అర్బన్: గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు క్షేత్రస్థాయిలో సుస్థిరాభివృద్ధి, పథకాలు సమర్థంగా అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీనిలోభాగంగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు బాపట్లలో ఆగస్టు 29 నుంచి ఐదు విడతలుగా శిక్షణ తరగతులు ప్రారంభించింది. జిల్లాలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 స్థాయి వరకు 432 మంది కార్యదర్శులను సుశిక్షితులను చేయనుంది.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీ స్థాయిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు తదితర కార్యాలయాలను పల్లె స్థాయిలోనే ఏర్పాటు చేసి సమర్థంగా సేవలు అందిస్తున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర కార్యక్రమాలు దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. వీటిపై కార్యదర్శులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం, మరింత మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ శిక్షణ సంస్థ చర్యలు చేపట్టింది.



శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు

బ్యాచ్‌కు 85 మంది చొప్పున

జిల్లాలో 459 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో గ్రేడ్ వన్ నుంచి గ్రేడ్ 5 వరకు 432 మంది కార్యదర్శులు ఉన్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు బాపట్ల కలెక్టరేట్‌లోని విస్తరణ శిక్షణ కేంద్రంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఒక బ్యాచ్‌కు 85 మంది చొప్పున ఐదు విడతలుగా శిక్షణ జరగనుంది. ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. ఆయా అంశాలపై రిసోర్స్‌పర్సన్లతో పాటు ఉపాధి హామీ ఇతర శాఖల అధికారులు హాజరై కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ నేపథ్యంలో గ్రామ పరిపాలనకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఒక మండలంలో మూడో వంతు మందికి ఒక బ్యాచ్‌గా శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణాంశాలు ఇవీ

మొదటి రోజు : స్థానిక స్వపరిపాలన, గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, అంతర్గత రోడ్లు, శ్మశానాలు, జల జీవన్ మిషన్, వీధిలైట్ల నిర్వహణ.

రెండో రోజు: పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థిక వ్యవహారాలు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్ను మదింపు, వసూలు, పంచాయతీల బడ్జెట్, రికార్డుల నిర్వహణ, ప్రతిభ పురస్కారాలు, జవాబుదారీతనం, క్రమశిక్షణ, ఆడిట్.

మూడోరోజు: లేఅవుట్లు, భవన నిర్మాణ నియమాలు, జగనన్న భూహక్కు– భూ రక్ష.

4,5 రోజులు: నథింగ్ అండ్ డ్రాఫ్టింగ్ లెటర్స్, కాండక్ట్ రూల్స్, సీసీఎల్ఏ రూల్స్, డీపీఎం అండ్ లీవ్ రూల్స్.

ఆరవ రోజు: నవరత్నాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, మూల్యాంకనం

మెరుగైన పాలనే లక్ష్యం



గ్రామీణ ప్రజలకు మెరుగైన పాలనను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. పంచాయతీల సమర్థ నిర్వహణ, పారదర్శకంగా పథకాల అమలుపై కార్యదర్శులందరికీ పూర్తి అవగాహన కల్పించేందుకు ఆరు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నాం.

– దాసరి రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి, బాపట్ల

అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. మండలస్థాయి అధికారులతో బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జిల్లాలో 1,356 పనులు మంజురయ్యాయని వివరించారు. ఆ పనుల కోసం రూ.57.22 కోట్లు మంజురయ్యాయని, ఇప్పటివరకు 323 పనులు పూర్తికాగా 96 మొదలుకాకపోవడమేమిటని నిలదీశారు. నెలరోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. సామాజిక పింఛన్లు జిల్లాకు కొత్తగా 5,150 మంజురయ్యాయని పేర్కొన్నారు. డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలకు ఒక్కొక్క పంచాయతీలో ఐదు సెంట్లు గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

గృహాల నిర్మాణంపైనా సమీక్ష

జగనన్న కాలనీలలో ఇంకుడు గుంతలు తవ్వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఇప్పటికే 2,900 ఇంకుడు గుంతలు మంజురయ్యాయని, 1,300 గుంతల నిర్మాణం జరుగుతుండగా మిగిలిన 1,600 గుంతలకు పంచాయతీలలో అనుమతులు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా 6,249 పక్కాగృహాలకు అనుబంధంగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలలో అలసత్వం తగదన్నారు. వేమూరు, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, చీరాల, అద్దంకి, రేపల్లె మండలాలలో గృహాల నిర్మాణాలలో పురోగతి లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసు జారీచేసి తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. పునాదికి దిగువ స్థాయిలో రేపల్లె మండలంలో 1,134, మార్టూరులో 815, బాపట్లలో 1,500 ఇళ్లు ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, గృహనిర్మాణ శాఖ అధికారి ప్రసాద్, సీపీఓ జి.భరత్, డీఆర్డీఏ పీడీ బి.అర్జున్‌రావు, పీఆర్ఎస్ఈ హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

ఓట్ల తొలగింపులపై ప్రత్యేక చర్యలు

ఓటర్ల జాబితాలో మృతులు, శాశ్వత వలసలు వెళ్లిన వారిని తొలగించే ప్రక్రియ సమర్థంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా కోసం 5 లక్షల 29 వేల 651 గృహాలను సర్వే చేశామని కలెక్టరు చెప్పారు. ఓట్ల తొలగింపుల కోసం వచ్చిన 28 వేల 925 దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

గొట్టిపాళ్లలో పోలీసు పికెట్



వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణల దృష్ట్యా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వి.శ్రీహరి బుధవారం తెలిపారు. గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఐదుగురి గాయాలైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

రాజకీయ లబ్ధి కోసం ఘర్షణలు సృష్టిస్తే కఠిన చర్యలు

రూరల్ సీఐ షేక్ షమీముల్లా



మాట్లాడుతున్న రూరల్ సీఐ షేక్ షమీముల్లా

మాచర్ల రూరల్: రాజకీయ లబ్ధి కోసం గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ షేక్ షమీముల్లా హెచ్చరించారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళవారం రాత్రి వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో సత్తెమ్మ కొలుపుల ఊరేగింపులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అరుగులపై కూర్చొని ఉండగా వారిపై పసుపు చల్లి రెచ్చగొడ్డడంతో ఏర్పడినట్లు చెప్పారు. తొలుత వైఎస్సార్ సీపీకి చెందిన రాజబోయిన రవీంద్ర, పి.వెంకటేశ్వర్లు, సూదనబోయిన ఆంజనేయులుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. ఆ తరువాత జరిగిన గొడవల్లో టీడీపీకి చెందిన రాజబోయిన బాబుకు గాయాలు అయినట్లు వివరించారు. తక్షణమే చర్యలు చేపట్టినట్లు వివరించారు. కొంత మంది సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలను చేసి లేనిపోని ఉద్రిక్త వాతావరణాన్ని ప్రేరేపించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం కూడా గ్రామాల్లో ఘర్షణలు ఏర్పడే పరిస్థితి నెలకొందని చెప్పారు. సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా పోలీసులు నిష్పక్షపాతంతో పూర్తిగా శాంతిభద్రతలను అదుపులోకి తీసుకొస్తున్నారని వివరించారు. నాయకులు, ప్రజలు, పోలీసు వ్యవస్థకు పూర్తిగా సహకరించి ప్రశాంత వాతావరణానికి చేయూతనివ్వాలని కోరారు. సమావేశంలో వెల్దుర్తి, విజయపురిసౌత్ ఎస్‌ఐలు శ్రీహరి, అనిల్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

సర్కారీ కొలువులపై గురి

వరుస నోటిఫికేషన్‌లతో ఆశావహంలో అభ్యర్థులు

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా గ్రూప్స్‌కు శిక్షణ
- గ్రామీణ విద్యార్థుల్లోనూ పెరిగిన ఆసక్తి
- అన్ని పరీక్షలకు దాదాపు ఒకే సిలబస్ కావడంతో ఏదో జాబ్ కొట్టొచ్చనే నమ్మకం
- విజయవాడ నగరంలో పెరిగిన శిక్షణ సంస్థలు

రాష్ట్ర ప్రభుత్వం వెంట వెంటనే గ్రూప్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయడంతో ప్రభుత్వ ఉద్యోగాలపై అభ్యర్థుల్లో ఆసక్తి పెరిగింది. ఉద్యోగ భద్రత, గుర్తింపు, సేవ చేసే అవకాశం ఉండటంతో రూ.లక్షల్లో జీతాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం సర్కారీ ఉద్యోగాలపై దృష్టి సారిస్తుండటం గమనార్హం. గ్రూప్ 1కు శిక్షణ పొందితే ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం గ్యారంటీ అనే ఉద్దేశంతో ఎక్కువమంది వీటిపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ కొలువుల కోసం శిక్షణ పొందుతున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది.

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు ఉద్యోగాల నోటిఫికేషన్లు రెండు మూడేళ్లకోసారి విడుదలయ్యేవి. ఒకసారి శిక్షణ పొందిన అభ్యర్థి ఆ నోటిఫికేషన్‌లో ఉద్యోగం రాకుంటే, ఏళ్లతరబడి వేచి చూడాల్సి వచ్చేది. దీంతో శిక్షణ పొందిన సిలబస్ మర్చిపోయేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వెంట వెంటనే నోటిఫికేషన్‌లు విడుదల చేస్తోంది. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్ 2022లో విడుదల చేయగా, తాజాగా గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్లు విడుదల చేశారు. వాటితో పాటు పంచాయతీ సెక్రటరీ, ఎస్‌ఐ ఉద్యోగాల నియామకాలు జరగనున్నాయి. దీంతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే రకమైన సిలబస్‌తో ఎంతో మేలు

ఏపీపీఎస్సీ నిర్వహించే అన్ని రకాల పరీక్షలకు దాదాపు ఒకేరకమైన సిలబస్ ఉండటంతో అభ్యర్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని విద్యావేత్తలు అంటున్నారు. గ్రూప్ 1కు శిక్షణ పొందిన వారు గ్రూప్ 2, గ్రూప్ 3 ఇతర ఉద్యోగాలను పొందగలుగుతున్నారు. యూపీఎస్సీ కోసం శిక్షణ పొందిన వారు సివిల్స్, ఐఎఫ్ఎస్, సీడీఎస్, ఇఎస్ఇ, సీఏపీఎఫ్‌లతో పాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సెబీ, ఐఆర్‌డీఏఐ, ఇపీఎఫ్ఓ, ఐబీ, ఆర్‌బీఐ, నాబార్డ్, ఎఫ్‌సీఐ వంటి సంస్థల్లో ఉద్యోగాల నియామక పరీక్షల్లో సులువుగా ఉత్తీర్ణత సాధించగలుగుతున్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పరీక్షల్లో సిలబస్ ఒకేలా ఉండటం ఎంతో మేలు చేస్తుంది.

లక్ష్యం ఉన్నతంగా ఉంటే...

నగరంలోని ఓ సంస్థలో సివిల్స్ కోసం లక్ష్మీప్రసన్న శిక్షణ పొందింది. ఆమె టార్గెట్‌ను అందుకోలేకపోయింది. తొలుత పంచాయతీ సెక్రటరీ ఉద్యోగం సాధించింది. ఆ తర్వాత 2022లో ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరై డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం పొందింది. ఇలా ఒక లక్ష్యాన్ని ఎంచుకున్న వారు రెండేళ్లలో ఏదో ఒక ఉద్యోగం పొందగలుగుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సైతం ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో శిక్షణ మెటీరియల్ అందుబాటులో ఉంటోంది. ఒకప్పుడు ఇంగ్లిష్ వచ్చిన వారు, మంచి స్కూలులో చదివిన వారు మాత్రమే ఉద్యోగాలు సాధించేవారు. ఇప్పుడు రెండేళ్లు కష్టపడితే సామాన్యులు సైతం ఉద్యోగాలు పొందగలుగుతున్నారు.

పథకాల పంపిణీ నిరంతరం కొనసాగాలి

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చిస్తూ అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు అందజేయాలన్నారు. కార్డులు తీసుకున్న వారికి అర్హత మేరకు రుణ సదుపాయం కల్పించేలా అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో 5–10 సంవత్సరాల మధ్యగల చిన్నారులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో లేఅవుట్స్‌లో ఇంటి నిర్మాణాలతోపాటు మౌలిక సదుపాయాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభించని వాటిని త్వరగా ప్రారంభించాలని చెప్పారు. స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న భూరక్షలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో చేర్చి పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ వివరించారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో నగదు జమ చేయాలి



సీఈఓకు వినతి పత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో నగదు జమచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు పేర్కొన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావును కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బసవ లింగారావు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ నుంచి నిలిచిపోయిన పీఎఫ్ చందా నగదును ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవా లని కోరారు. జిల్లాల విభజన తరువాత 296 డీడీవో కింద వేతనాలు పొందుతున్న వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల నెలవారీ పీఎఫ్ ఖాతా లు ట్రెజరీ కార్యాలయాల నుంచి షెడ్యూల్ పాస్‌బుక్ కన్సాలేషన్‌తో రాలేదనే కారణంగా నిలుపుదల చేయడంతో పీఎఫ్ రుణాలు, ఉద్యోగ విరమణ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. 11 నెలలుగా నెలవారీగా చెల్లిస్తున్న పీఎఫ్ నగదుకు వడ్డీ సైతం వస్తుందీ, లేనిదీ తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతు న్నారని, ఆయా సమస్యలను పరిష్క రించాలని కోరారు. సీఈవోను కలసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పసుపులేని శ్రీను, ఎస్. సత్యనారాయణ మూర్తి, జోసఫ్ కిరణ్, దాస్, మల్లికార్జునరావు, లక్ష్మీనారాయణ, అప్పారావు, శంకర్, నాగాంజనేయులు పాల్గొన్నారు.

ఎఫ్ఐసీటీసీ కేంద్రాన్ని సందర్శించిన నాకో బృందం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

గుంటూరు లీగల్: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (నాకో) సమన్వయ కర్త ప్రశాంత కుమార్, ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో నాకో బృందం బుధవారం గుంటూరు జిల్లా కారాగారాన్ని సందర్శించింది. కారాగారంలో ఇటీవల ప్రారంభించిన ఎఫ్ఐసీటీసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఖైదీలకు హెచ్.ఐ.వి., హెపటైటిస్, టీబీ, సిఫిలిస్ వ్యాధుల నిర్ధారణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్ధరణ పరీక్షల విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ కె.రఘు, కారాగార వైద్యాధికారి కె.లక్ష్మి పూర్ణలత, జైలర్ బి.తేజేశ్వర్‌రావు, ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్, డీఏపీసీయూ డీపీఎం మధుసూదన్, స్టేట్ ప్రిజన్ కోఆర్డినేటర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఈహెచ్ఎస్ సేవలు ప్రారంభం



ఈహెచ్ఎస్ సేవల ఓపీ ప్రారంభిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు

చిలకలూరిపేట: ప్రభుత్వ ఉద్యోగులు ఏరియా ఆస్పత్రిలో ఈహెచ్ఎస్ సేవలు ఉపయోగించుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు కోరారు. వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సేవల ఓపీని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిపుణులైన వైద్యులతో ఈహెచ్ఎస్ కార్డు కలిగిన వారికి వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. సోమవారం జనరల్ సర్జరీ, మంగళవారం జనరల్ మెడిసిన్, గుండె, బుధవారం చర్మ వ్యాధులు, గురువారం ఎముకలు, న్యూరాలజీ, శుక్రవారం జనరల్ మెడిసిన్, కిడ్నీ, శనివారం పిల్లల, జనరల్ మెడిసిన్ ఓపీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేత్రదానం చేయాలి...

నేత్రదానం చేయదలిచిన వారు ప్రభుత్వాస్పత్రిలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నేత్రదానికి వయసుతో సంబంధం లేదని, కళ్లద్దాలు ధరించేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, బీపీ, రెటీనా వ్యాధులు కలవారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. వ్యక్తి మరణించినా వెంటనే ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చి ఆరుగంటల వ్యవధిలో మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలు స్వీకరించవచ్చన్నారు. ఐ బ్యాంక్ బృందం నేత్ర దానం ఇచ్చే వ్యక్తి ఇంటికైనా, ఆస్పత్రికైనా, మార్చురీకైనా, శ్మశానవాటికకైనా వెళ్లి తీసుకుంటారని తెలిపారు. ఒక్క కార్నియా మాత్రమే తొలగించబడుతుందని, ముఖం ఏ మాత్రం చెదరదని, దీనికి కేవలం 20 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని వివరించారు. మరణించిన వ్యక్తి నుంచి కార్నియా తీసుకోవడం ద్వారా ఇద్దరికి దృష్టి ప్రసాదించే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

రీసర్వేకు రికార్డుల స్వచ్ఛీకరణ ముఖ్యం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



గుంటూరు వెస్ట్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భూముల రీ సర్వేకు రికార్డుల స్వచ్ఛీకరణ చాలా ముఖ్యమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం రీ సర్వే రెండో దశ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో మూడో దశ పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. దీనికి సంబంధించి గ్రామాల్లో ఎఫ్‌పీఓఎల్ఆర్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎఫ్‌పీఓఎల్ఆర్‌లో గుర్తించిన మ్యూటేషన్లు 15 రోజుల్లోనే పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం 33 గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఫేజ్-2 పనులు వచ్చే నెల 5 నాటికి ఫైనల్ ఆర్ఓఆర్ జారీ చేయాలన్నారు. భూముల రీ సర్వేకు సంబంధించి చాలా ప్రక్రియలు సరళీకృతం చేసేందుకు ఆర్ఓఆర్ మ్యాపులు వచ్చేలోపు గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సరిహద్దుల మార్కింగ్ పూర్తి చేయాలని చెప్పారు. గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి అయినప్పటి నుంచే భూ హక్కు పత్రాలకు సంబంధించి యజమానుల వివరాలను పర్సనల్ లేయర్‌లో నమోదు చేయాలని చెప్పారు. రీ సర్వేలో గుర్తించిన సమస్యలను ఎప్పటికప్పుడు మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామాల్లోని అసైన్డ్, ఇనామ్ భూములకు సంబంధించి వివరాలను ఫార్మాట్స్‌లో వెంటనే అందించాలన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సర్వే అధికారి నాగేషు, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తెనాలి వైద్యశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్

- ఏర్పాటుకు నిపుణుల బృందం పరిశీలన
- జిల్లాలో మొదటిసారిగా ఏర్పాటుకు నభ్యుల నిర్ణయం



తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వసతులను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

తెనాలిఅర్బన్ (కొల్లిపర): జిల్లాలోనే తొలిసారిగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు అవసరమైన వసతులను పరిశీలించేందుకు బుధవారం నిపుణుల బృందం వారైన పి.ఈ.పి.ఎఫ్.ఎ.ఆర్ కోర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఏపీ.ఎస్.ఎ.సి.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ భారతి, ఎపి.ఎస్.ఎ.సి.ఎస్ గైనకాలజీ అండ్ క్యాన్సర్ స్పెషలిస్ట్ సి.హెచ్.ఎస్ నాయుడు, సి.క్యూ.ఎల్. స్పెషలిస్ట్ ఇండియా నిపుణులు తెనాలి వైద్యశాలకు వచ్చి పలు అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోనే మొదటిసారిగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వైద్యశాలలో అనువైన స్థలాన్ని, వసతులను పరిశీలించి నివేదికను ఉన్నత అధికారులకు, ప్రభుత్వానికి అందించి త్వరలో నిర్మించేలా కృషి చేయటం జరుగుతుందన్నారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. వీరిని తొలి దశలోనే పరీక్షించి తగిన ట్రీట్మెంట్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు అందు కోసం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోలు సొసైటీ, షేర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సిక్యూఎల్ స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మెడికల్ సూపరింటెండెంట్ మజిద బేగం, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

భక్తుల విశ్రాంతి భవన నిర్మాణానికి భూమి పూజ

భక్తుడి రూ.70 లక్షల విరాళంతో భవనం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయం వద్ద సాధారణ భక్తుల విశ్రాంతి భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన దివంగత చిన్నం యాగయ్య జ్ఞాపకార్థం కుమారుడు నరేష్, అల్లుడు శ్రీను రూ.70 లక్షల విరాళంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు మాట్లాడుతూ భవన నిర్మాణానికి సంబంధించి గతంలోనే దాతలు అంగీకార పత్రం అందజేశారన్నారు. ఆలయానికి వచ్చే సాధారణ భక్తులు 500 మంది విశ్రాంతి తీసుకునేందుకు ఈభవనం నిర్మిస్తున్నామని తెలిపారు. దీని నిర్మాణానికి అమ్మవారి భక్తులు యాగయ్య కుటుంబ సభ్యులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. భవనం పూర్తిగా దాతలు నిర్మించనుండగా ఆలయ అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు. దాతలు ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.